క్లుప్తంగా

నేటి నుంచి యూబీఐ మెగా రిటైల్ అవుట్ రీచ్‌ప్రోగ్రాం



కొరిటిపాడు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం నుంచి రెండు రోజులపాటు మెగా రిటైల్ అవుట్‌రిచ్ ప్రొగ్రామ్‌ను రెవెన్యూ కల్యాణ మండపం వద్ద నిర్వహించనున్నట్లు యూబీఐ రీజనల్ హెడ్ కుందన్‌లాల్ తెలిపారు. జీటీరోడ్డులోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్లు, వాహన డీలర్లు, విద్యా సంస్థల ప్రతినిధులు, అనుబంధ సంస్థల వారు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌లు, సీనియర్ అధికారులు, స్థానిక వివిధ శాఖల శాఖాధిపతులు పాల్గొన్నారు.

ప్రతి వైద్యుడు నిరంతర విద్యార్థి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతి వైద్యుడు నిరంతర విద్యార్థి అని, నిత్యం జ్ఞానాన్ని సముపార్జిస్తూ గురువుగా అందరికీ తాను నేర్చుకున్న విద్యను పంచే గొప్పవ్యక్తి అని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ అన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులో భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ భారతరత్న అవార్డు గ్రహీత, మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ద్వారా యువతరం మెరుగైన సమాజంలోకి అడుగుపెడుతుందన్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించేందుకు కఠోరశ్రమతో పాటు సరైన ప్రణాళిక ద్వారా కృషి చేస్తే వైద్య విద్యార్థులు ఉత్తమ వైద్యులుగా రాణిస్తారని అన్నారు. రాష్ట్ర టీబీ నియంత్రణాధికారి డాక్టర్ టి.రమేష్ మాట్లాడుతూ జ్ఞానాన్ని పంచుకుంటే పెరుగుతుందని, లక్ష్యం పటిష్టంగా ఉంటే దానిని సాధించాలనే ఆసక్తి పుడుతుందని అన్నారు. పొగాకుబోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎంతో మంది గురువుల చొరవతో తాను ఈస్థానంలో ఉన్నానని, విద్య నేర్పిన గురువులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ తన తొలి గురువు తన మాతృమూర్తి పేరమ్మ అని, ఎంతో మంది గురువుల ప్రోత్సాహంతో పాటు సహాయ సహకారాల ద్వారా ఈ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. అనంతరం భాష్యం వైస్ చైర్మన్ హనుమంతరావు చేతుల మీదుగా అతిథులను సత్కరించారు. భాష్యం విద్యార్థిని గీసిన భాష్యం రామకృష్ణ చిత్రాన్ని ఆయనకు బహూకరించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, సలహాదారుడు మైఖేల్‌రాజు, ఐఐటీ ప్రోగ్రామర్ ఆనందకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా నగరంలోని భాష్యం క్యాంపస్‌లలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

యువకుడిని గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్ : యువకుడిని గాయపరిచిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బ్రాడీపేటలో నివసించే మేరుగ పండు బాజారుకు వెళ్లి వస్తుండగా పరిచయం ఉన్న నాగరాజు వచ్చి మా అబ్బాయిని ఎందుకు చెడగొడుతున్నావు పండు తలను ఆటోకేసి కొట్టాడు. దీంతో పండు తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం హనుమయ్యనగర్ 1వలైనులో నివాసం ఉండే బాణా బాలభాస్కర్ (29) మనస్పర్ధల కారణంగా భార్యతో విడిపోయి ఒంటరిగా నివశిస్తున్నాడు. మంగళవారం బాలభాస్కర్ ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం సేవించి...

అతిగా మద్యం సేవించిన వ్యక్తి మృతిచెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఆదిత్యనగర్ 1వలైనులో నివశించే గుంటి దీపక్ (46) వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. మనస్పర్ధల కారణంగా భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. ఈనెల 4న అతిగా మద్యం సేవించి రోడ్డుపై పడి ఉంటే సోదరుడు దిలీప్ దీపక్‌ను ఇంటి వద్ద దింపి వెళ్లిపోయాడు. దీపక్ మంగళవారం ఉదయం ఇంటి వెలుపల మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి దిలీప్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పాటిబండ్ల సీతారామయ్య స్కూలులో ఉపాధ్యాయ బృందంతో విష్ణువర్ధన్



ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో అమీనాబేగంకు జ్ఞాపిక బహూకరిస్తున్న ఫ్రాన్సిస్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి



సన్మాన గ్రహీతలతో డాక్టర్ ఆదినారాయణ, రంగారావు



చౌత్రా హైస్కూల్లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ చిష్టీ, ఖాసిం



కృష్ణ చైతన్యరెడ్డిని సన్మానిస్తున్న హేమలత

భగవంతుని స్వరూపమే ఉపాధ్యాయుడు

జాయ్ అండ్ షైన్‌లో టీచర్స్ డే

గుంటూరు వెస్ట్: తల్లిదండ్రులిచ్చిన జన్మకు సార్థకతను చేకూర్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు సాక్షాత్తూ భగవత్ స్వరూపులను జాయ్ అండ్ షైన్ చీఫ్ కోచ్ జె.జ్యోతి శ్యామ్ కొనియాడారు. టీచర్స్ డేను పురస్కరించుకుని స్థానిక బ్రాడీపేటలోని కోచింగ్ సెంటర్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో పది మందికి ఆరోగ్యాన్ని అందిస్తూ, వారిని నిత్యం చైతన్య పరిచే విధంగా గురువులు తనను మలిచారన్నారు. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని చెప్పారు. బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ పెర్లియానీ అమల మాట్లాడుతూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నందుకు గర్విస్తున్నానన్నారు. అనంతరం జ్యోతి శ్యామ్, యానీ అమలు, క్రాతి కుమార్‌లను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అమీన్, సల్మా, ఆర్.అనూష, పవన్ కళ్యాణ్, సంధాని, వెంకాయమ్మ, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

నెహ్రూనగర్: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. మంగళవారం పాత గుంటూరు నందివెలుగురోడ్ లోని అప్పర్ ప్రైమరీ పాఠశాలని పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమన్నారు.

ఉపాధ్యాయులను గౌరవించే సంస్కృతి మనది

గుంటూరు మెడికల్: ప్రస్తుత సమాజంలో చిత్ర పరిశ్రమ ఉపాధ్యాయులను జోకర్ లా చూపించడం బాధాకరమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జనరల్ సర్జరీ ఓపీ విభాగంలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని చులకన చూడకూడదన్నారు. ఇలా చూపించడం వల్ల విద్యార్థులు ఉపాధ్యాయులను ఆట పట్టిస్తున్నారన్నారు. ఆసుపత్రిలో పేషంట్ వైద్యులకు టీచర్ లాంటి వారని చెప్పారు. పేషంట్ల నుంచి నేర్చుకోవడానికి అవకాశం కలుగుతోందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సంతోష్, డాక్టర్ వంశీ, డాక్టర్ ఇందిరా, డాక్టర్ వేణు పాల్గొన్నారు.



గుంటూరు కోచింగ్ సెంటర్లో టీచర్స్ డే సందర్భంగా విద్యావేత్తలను సన్మానిస్తున్న దృశ్యం

దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

నెహ్రూనగర్: దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని వీఎస్ఆర్ హై స్కూల్ డైరెక్టర్ వంగా శ్రీనివాసరావు తెలియజేశారు. మంగళవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కూల్‌లో ఘనంగా వేడుకలను నిర్వహించారు. గురువు విద్యతో పాటు విచక్షణ కూడా నేర్పిస్తారని ఆ విచక్షణ విద్యార్థులను మంచి మార్గం వైపు నడిపిస్తుందన్నారు.

భావి భారత రూపకర్తలు ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు భావి భారత రూపకర్తలని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. మంగళవారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్దన్ మాట్లాడుతూ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని అన్నారు. అదే విధంగా కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న పాఠశాల హిందీ ఉపాధ్యాయిని వి. శివనాగమల్లేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపనవి పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో...

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ అమీనాబేగంతో పాటు ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్లు ఆరోన్ రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి సత్కరించారు.

గార్డెన్స్ ఆలయంలో....

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై మంగళవారం గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభకు సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహించారు. అతిథులుగా సాహితీవేత్తలు డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మీ, డాక్టర్ తాళ్ళూరి లక్ష్మీప్రసన్న, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సి.హెచ్. మస్తానయ్య, శివశంకర్, సంస్థ కన్వీనర్ గుళ్ళపల్లి రాఘవేంద్రరావులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, అతిథులను సంస్థ కన్వీనర్ రాఘవేంద్రరావు, అధ్యక్షులు గుళ్ళపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో సన్మానించారు.

కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్‌లోని కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం, కృష్ణాష్టమి వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ పీఎల్ హేలత పాల్గొన్నారు.

చౌత్రా హైస్కూల్లో ..

గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయ బృందాన్ని సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం మాట్లాడుతూ విద్యాబోధనలో విశేష అనుభవం గడించిన ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభావితం చేస్తారని అన్నారు. ఈసందర్భంగా స్థానిక కార్పొరేటర్ చిష్టీ పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు.

శ్రీపూజిత స్కూల్లో ...

పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి పాఠశాల ఉపాధ్యాయ బృందానికి సరదా ఆటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు.

వేదాల కాలం నుంచి గురువుకు ప్రాముఖ్యత

గుంటూరు ఎడ్యుకేషన్: సనాతన భారతదేశంలో వేదాల కాలం నుంచి గురువుకు ప్రాముఖ్యత ఉందని గుంటూరు చలమయ్య-కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కర్నూరపు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. మంగళవారం సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహంకాళి శ్రీనివాసరావుతో పాటు జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ సుభద్ర, హైస్కూల్ హెచ్ఎం రమాదేవి,అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో బాపూజీ కమిటీ అధ్యక్షుడు సాధు శివ శంకర్, ఉపాధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

-పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ ఇ. వరప్రసాద్, వాసవి విద్యానిధి కమిటీ సభ్యుడు పి. పిచ్చయ్య, బి. మల్లిఖార్జునరావు ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు.

ఈసందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్‌తో పాటు అధ్యాపక బృందాన్ని కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

-ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ స్కూల్లో జరిగిన వేడుకల్లో విజ్ఞాన్ వర్సిటీ డీన్ ప్రొఫెసర్ శారద, ప్రొఫెసర్ రవిబాబు, జోనల్ ఇన్‌చార్జ్ అనురాధ ముఖ్య అతిథులుగా పాల్గొని ఉపాధ్యాయుల గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

-అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో అమరావతి హాస్పిటల్స్ వైద్యుడు రామ్ తారక్‌నాథ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, పి.సీ తారామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

-నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్లో జరిగిన వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ ఎన్. చక్రనాగ్, ప్రిన్సిపాల్ ఎన్.కోటేశ్వరరావు ఉపాధ్యాయ బృందాన్ని సత్కరించారు.

-పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో జరిగిన వేడుకల్లో కళాశాల కరస్పాండెంట్ షేక్ సుభానీ, ప్రిన్సిపాల్ షేక్ షాహీనా బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు మెడికల్: టీచర్స్ డే సందర్భంగా మంగళవారం డాక్టర్ వై.ఎస్.వి.కిషోర్ కుమార్‌ను పలువురు వైద్యులు, లా స్టూడెంట్స్ సత్కరించారు.



పద్మావతికి అభినందనలు తెలియజేస్తున్న ఉపాధ్యాయులు



చలమయ్య కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న యాజమాన్యం



టీజేపీఎస్ కళాశాలలో అధ్యాపకులకు సన్మానం



హిందూ ఫార్మసీ కళాశాలలో డాక్టర్ రామ్ తారకనాథ్‌కు సన్మానం

దాతలూ.. మీసేవలు అభినందనీయం

గుంటూరు మెడికల్: ఆసుపత్రి అభివృద్ధి కోసం పట్టపు బసవప్పున్నయ్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు నాలుగు మినరల్ వాటర్ కూలర్‌లను అందించడం అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. మానసిక వైద్య విభాగం సమీపంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ కూలర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి లో నాలుగు వాటర్ కూలర్‌లు పట్టపు గోపాలకృష్ణ అందించారని, మరో పది వాటర్ కూలర్‌లను ఇవ్వడానికి సిద్ధంగా ఉండటం సంతోషకరమైన విషయమన్నారు. కొంతమంది వాటర్ కూలర్లను పాడు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, పట్టపు గోపాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తల్లి, బిడ్డలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

తల్లి బిడ్డలను సురక్షితంగా వారు కోరుకున్న చోటకు తీసుకెళ్ల వలసిన బాధ్యత డ్రైవర్లపై ఉందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం బాలింతల వార్డును ఆయన పరిశీలించారు.

బాలింతలు కోరుకున్న చోట తీసుకుని వెళ్లడం లేదని ఫిర్యాదులు వస్తుండటంతో డీఈఓ, ఆరోగ్య మిత్ర, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్ల తో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడారు. తల్లి బిడ్డలను వారి గమ్యస్థానానికి పంపించే విధంగా డ్రైవర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. డ్రైవర్లకు నచ్చిన చోట పంపించాలని చూస్తే సహించనని ఆయన హెచ్చరించారు. బాలింతలు ఎక్కడకు వెళ్లాలో అక్కడకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. ఆసుపత్రిలో 13 తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలు అందుబాటులో ఉండగా, కేవలం ఆరు, ఏడు గురు మాత్రమే పని చేయడం వల్ల బాలింతలు త్వరగా ఇంటికి చేరుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న డ్రైవర్ల పోస్టులను భర్తీ చేసి బాలింతలను వెంటనే ఇంటికి పంపించాలని కోరారు.



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

టీబీ కేంద్రాన్ని నూతన భవనంలోకి మారుస్తాం

గుంటూరు జీజీహెచ్ ఆవరణంలో ఉన్న తాత్కాలిక జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ కేంద్రాన్ని నూతన భవనంలోకి మార్చేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన క్షయ వ్యాధి నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. గతంలో రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న క్షయ వ్యాధి నియంత్రణ కేంద్రాన్ని తాత్కాలికంగా జీజీహెచ్ ఆవరణంలోకి మార్చారని తెలిపారు. టీబీ కేంద్రం వైద్య సిబ్బంది ప్రస్తావించిన సమస్యలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులతో చర్చించి నూతన భవనంలోకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జీజీహెచ్‌లో నూతనంగా నిర్మించిన భవనంలో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం టీబీ కేంద్రానికి అప్పగించి మొదటి అంతస్తు ఆసుపత్రికి ఉపయోగ పడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదాల బారిన పడకుండా పనిచేయాలి



గుంటూరు వెస్ట్: క్వారీలు, స్టోన్ క్రషర్స్‌లో పని చేసే కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డ్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సొసైటీ జ్ఞానేశ్వర్ తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక లక్ష్మీపురంలోని హోటల్లో భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కార్మికుల భద్రత కోసం డీజీఎంఎస్ హైదరాబాద్ రీజన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా క్వారీ, స్టోన్ క్రషర్ యజమానులు కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలన్నారు. వారికి పనిచేసే చోట ఫస్ట్ ఎయిడ్‌తోపాటు ప్రమాదాలు జరిగిన వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భారత ప్రభుత్వం కార్మికుల కోసం అనేక ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సొసైటీ సుప్రియా చక్రవర్తి, ఐఐటీ శాస్త్రవేత్తలు డాక్టర్ దేబరేష్ చక్రవర్తి, డాక్టర్ బిస్వజిత్ పాల్గొన్నారు.

సైకిల్ నుంచి జారిపడి వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తూ సైకిల్ నుంచి జారిపడి వ్యక్తి తీవ్ర గాయాలతో మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. జేకేసీ కళాశాల రోడ్డులో నివాసం ఉంటున్న చెరుకూరి సుబ్బారావు(50) ఫోటో ఫ్రేమ్ వర్క్ చేస్తున్నారు. సాయంత్రం జేకేసీ కాలేజ్ రోడ్డులో సైకిల్‌పై వస్తూ కిందపడ్డాడు. తలకు తీవ్రగాయం కావటంతో స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

పట్నంబజారు: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు సీఎంఆర్‌కు దరఖాస్తు చేసుకున్న ఏడుగురికి రూ. 7.08 లక్షల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా మాట్లాడుతూ అనారోగ్య రీత్యా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందిన తరువాత వారి కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ పథకం చేదోడుగా నిలుస్తోందన్నారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ పథకం చికిత్స పొందిన రోగుల కుటుంబాలకు అందిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ చెక్కు అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యమే కీలకం

- నిర్లక్ష్యం వహిస్తే సహించం
- హెచ్చరించిన కమిషనర్

నెహ్రూనగర్: ప్రజారోగ్య పరిరక్షణలో మెరుగైన పారిశుద్ధ్యం కీలకమని, పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ పాత గుంటూరులోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రజారోగ్యానికి భరోసా అని, అటువంటి కీలకమైన పారిశుద్ధ్య పనుల నిర్వహణలో శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. కొందరు శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు పని వేళల్లో విధుల్లో ఉండడంలేదని తమ దృష్టికి వచ్చిందని, తనిఖీల్లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్మికులు, కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, అప్పుడే ప్రజలు రోడ్ల మీద వ్యర్థాలు వేయకుండా ఉంటారన్నారు. అలాగే రోడ్ల మీద వ్యర్థాలు వేసే వీధి వ్యాపారులపై అపరాధ రుసుం విధించాలన్నారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ ఉండటానికి వీలు లేదని ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేకంగా ఆయా పాయింట్స్‌పై దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం చేపట్టే గ్యాంగ్ వర్క్ డివిజన్ల వారిగా రోజువారీ షెడ్యుల్ పంపాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఎస్.ఎస్. ఆయుబ్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.ఐజాక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజారోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి

పట్నంబజారు: ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. ఈక్రమంలో మంగళవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని పొన్నూరు రోడ్డు, బారాఇమాంపంజా రోడ్డు, సమాధుల రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సైడ్ కాల్వలు, రోడ్లు పరిశీలించి పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారవడంతో వారికి మరమ్మతులు చేయించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో వర్షపు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు డ్రెయినేజీ శుభ్రం చేయాలని సూచించారు. స్థానికంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు నూరిఫాతిమా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.



డ్రెయినేజీ సమస్యలను పరిశీలిస్తున్న నూరిఫాతిమా

మార్కెట్లోకి ఎక్స్ ప్రెస్ హోండా నూతన కారు

పాత గుంటూరు: ఎక్స్‌ప్రెస్ హోండా గుంటూరులో ఎలివేట్ ఎస్ యు వి మోడల్ నూతన కారును మంగళవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎం.డి రాజేష్, ఆర్ ఎస్ ఎం.గిరీష్ మాట్లాడుతూ హోండా తొలిసారిగా ఎస్ యువి మార్కెట్ విభాగంలో అడుగుపెట్టిందన్నారు. దీని ధర మాన్యువల్ వేరియంట్ లో 10.99 లక్షల నుంచి 14.99 లక్షల వరకు ఎక్స్ షోరూం (ప్రైస్) ఉంటాయని తెలిపారు. సీఈఓ దిలీప్ మాట్లాడుతూ ఎలివేట్ హుండాయ్ ఇతర కంపెనీలకు చెందిన కార్లకు గట్టి పోటీనిస్తుందని తెలిపారు. ఇది పెట్రోల్ వేరియంట్లో లభిస్తుందని తెలిపారు. దీనిలో మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ 15.3 కిలోమీటర్లు, ఆటోమేటిక్ 16.3 కిలోమీటర్లు మైలేజ్ ఇస్తుందని తెలిపారు.



ఎలివేట్ ఎస్ యు వి కారును ఆవిష్కరించిన రాజేష్, గిరీష్, దిలీప్